క్లుప్తంగా

అన్న సమారాధన

పాలకొండ రూరల్: నందీశ్వర వేడుకల్లో భాగంగా గురువారం నగర పంచాయతీ పరిధి మేదర వీధిలో మహాన్నదాన కార్యక్రమం చేపట్టారు. వేలాది మంది భక్తులు ఈ ఆధ్యాత్మిక భోజనాల్లో పాల్గొన్నారు. అంతకు ముందుకు నందీశ్వరునికి సాంప్రదాయ పూజలు వైభవంగా జరిగాయి. ఏటా ఆనవాయితీగా మేదర్లు ఈ నవరాత్రులు పాటిస్తున్నట్లు ఆ సంఘ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ క్రమంలో స్వామివారి నిమజ్జనోత్సవం ఎంతో వైభవంగా చేపట్టారు.

విద్యార్థుల ఆరోగ్యానికీ ప్రాధాన్యమివ్వండి



కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు

కురుపాం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు వారి ఆరోగ్యానికీ ప్రాధాన్యమివ్వాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి వై.నాగేశ్వరరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన గురువారం సందర్శించి, కళాశాల సిబ్బందితో సమావేశమయ్యారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని, అలాగే వారికి అవసరమైన మౌలిక వసతులు వారికి అందుబాటులో ఉంచాలని తెలిపారు. కళాశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయోగ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త సిలబస్ ఆధారంగా ల్యాబ్‌లు నిర్వహించాలని చెప్పారు. అనంతరం కళాశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కురుపాం: సైన్స్ సెమినార్‌లో స్థానిక ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థిని నెల్లి శ్రీనిధి విశేష ప్రతిభ కనబరిచింది. మండల స్థాయిలో జరిగిన సెమినార్ పోటీల్లో శ్రీనిధి పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి సెమినార్ పోటీలకు ఎంపికైంది. దీంతో సదరు విద్యార్థినిని ఉపాధ్యాయ సిబ్బంది గురువారం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడాపోటీలు

కొమరాడ: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని కోటిపాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థినులకు పలు క్రీడాపోటీలు గురువారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ పీవో సుగుణ కుమారి మాట్లాడుతూ ప్రతి బాలిక తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీదేవి యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కురుపాం: స్థానిక గాయత్రి ప్రజ్ఞాపీఠం వార్షికోత్సవం పురస్కరించుకుని, ప్రజ్ఞాపీఠంలో ఐదు కుండీల గాయత్రీదేవి యజ్ఞం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, కొమరాడ ప్రాంతాల నుంచి 300 మంది గాయత్రిదేవి భక్తులు ఈ యజ్ఞంలో పాల్గొని, అమ్మవారి పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. కార్యక్రమంలో గాయత్రీ పరివార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జైగురుదత్త హోమం..



గరుగుబిల్లి: హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం జైగురుదత్త హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన యజ్ఞకర్త ఎస్వీఎల్ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం గురుదత్త హోమంను ఆలయ అర్చకులు శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు. హోమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా...!



- అధ్వానంగా అంతర్ జిల్లాల రహదారులు
- నిత్యం ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- నాడు రహదారులే కీలక అజెండా అన్న కూటమి నేతలు

పాలకొండ రూరల్:

రహదారులు రక్తమోడుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాల బారిన పడి పలువురు క్షతగాత్రులవుతున్నారు. మరికొందరు ప్రాణాలు పోగొట్టుకుని వారి కుటుంబాలకు తీరని లోటు మిగుల్చుతున్నారు. నిశిరాత్రిలో... పట్టపగలు తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న కుటుంబాల నుంచి ఈ పాపం ఎవరిది అన్న ప్రశ్న తలెత్తినప్పుడు అటు పాలకులు, ఇటు సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి సమాధానం రావటం లేదు. సమస్యలు గుర్తించి పత్రికలు, సోషల్ మీడియా ద్వారా కళ్లకు కట్టినట్టు రహదారి సమస్యలను ఎత్తి చూపుతున్నా సంబంధిత అధికారులు కనీసం స్పందించటం లేదు.

పరమ అధ్వానంగా...

డివిజన్ కేంద్రం పాలకొండ మీదుగా శ్రీకాకుళం, విజయగనం, విశాఖపట్టణం, పార్వతీపురం మీదుగా ఒడిశా తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన అంతర్ జిల్లాల రహదారులు అధ్వానంగా మారాయి. పలు చోట్ల, కీలక, ప్రమాదకర మలుపుల వద్ద రహదారులపై ఏర్పడ్డ గుంతలు, భారీ గోతులు కారణంగా ఇటీవల అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పాలకొండ - పార్వతీపురం రహదారిలో రాజుపేట వద్ద, పాలకొండ-శ్రీకాకుళం రహదారిలో బూర్జ మండలం నీలంపేట వద్ద, విశాఖ రహదారిలో గోపాలపురం వద్ద ఇలా చెప్పుకుంటూ పోతే అనేక చోట్ల రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా... మరికొందరు చావు తప్పి భయపడినా క్షతగాత్రులుగా మారారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రహదారుల్లో రాళ్లు తేలి... గుంతలు దర్శమిస్తున్నాయి. తాజా వర్షాలతో సమస్య మరింత జటిలంగా మారింది.

భయం గొలుపుతున్న రోడ్లు

విధి నిర్వహణలో భాగంగా... ఇతర పనులపై పాలకొండ మీదుగా ఉమ్మడి జిల్లా శ్రీకాకుళం వెళ్లాలంటే జిల్లా సరిహద్దులో కష్టాలు ప్రారంభమవుతాయి. ముఖ్యంగా మత్రిపాడు, తుడ్డలి, లక్కుపురం, కొండపేట, అప్పలపేట, ఉప్పినివలస, నీలంపేట, కొల్లివలస సమీప రహదారిలో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇదే రీతిన పాలకొండ మీదుగా రాజాం వయా విజయనగరం, విశాఖ రహదారితో పాటు పార్వతీపురం ప్రధాన రహదారుల్లో సమస్యలు దీర్ఘకాలంగా తిష్ట వేసుకుని ఉన్నాయి. మండల సరిహద్దు గోపాలపురం దాటిన వెంటనే సంకిలి వంతెన, చక్కెర కర్మాగారం వద్ద, మజ్జిరాముడుపేట, ఉంగరాడ మెట్ట, రాజాం – బొద్దాం తదితర ప్రాంతాల్లో ఏర్పడ్డ గోతుల కారణంగా భారీ వాహనాలు కూడా నడపలేని స్థితి నెలకొంది. ఇదే రహదారుల్లో శ్రీకాకుళం జిల్లాకు 20 ఆర్టీసీ సర్వీసులు 180 ట్రిప్పులు నడుస్తుండగా విశాఖ, విజయగరం, రాజాంకు 25 పల్లె వెలుగు, 25 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సగటున రోజుకు 400 ట్రిప్పులు పాలకొండ డిపో నుంచి నడుస్తున్నాయి. రోడ్డు సమస్యలతో పెద్ద వాహనాలు సహితం రహదారి సమస్యల కారణంగా టైర్లు, ఇంజన్ ఛాసీలు, స్ప్రింగ్ కట్టలు, యూ క్లాంప్‌లు పాడవుతున్నట్లు యజమానులు పేర్కొంటున్నారు.



కొల్లివలస వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడ్డ గోతులు



పాలకొండ- శ్రీకాకుళం రహదారిలో నీలంపేట వద్ద ఈ నెల 15వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడు(ఫైల్)

రహదారులే కీలక అజెండా..

ఎన్నికల సమయంలో గ్రామీణ, అంతర్గత, అంతర్ జిల్లాల రహదారులు పురోగతి ప్రధాన అజెండగా ముందుకు వచ్చిన కూటమి ఇప్పుడు రహదారులను మెరుగుపరచడంలో వెనుకబడింది. పల్లె పండగ పేరిట చేపట్టిన పనులు పలు చోట్లు అర్థాంతరంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయి.

ప్రతిపాదించాం..

ఇదే విషయంపై ఆర్అండ్‌బీ జేఈ తోలేటి కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా పాలకొండ గాయత్రీ ఆలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకూ ప్రధాన రహదారి విస్తరణకు రూ.16.50కోట్లు, రాజాం రహదారిలో గల సంకిలి వంతెనపై మరామ్మతులకు రూ.కోటి 5లక్షలు, పాలకొండ-వీరఘట్టం రహదారిలో రాజుపేట కూడలి వద్ద గల రెండు మినీ వంతెనల అభివృద్ధికి రూ.2కోట్లు మేర ప్రతిపాదనలు చేశామన్నారు. ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

చర్యలు చేపట్టాలి



పట్టణం దాటి ఎటువైపు వెళ్లినా రహదారి సమస్యలు తప్పటం లేదు. భారీ గోతులు, రాళ్లు తేలిన రహదారులు దర్శనమిస్తున్నాయి. నూతన రహదారుల నిర్మాణాలు అలా ఉంచితే ప్రస్తుతం ఉన్న గోతులు కప్పితే చాలు పలువురు ప్రాణాపాయం నుంచి బయటపడతారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలి.

– యందవ మరియదాసు, పాలకొండ నగర పంచాయతీ

డిజిటల్ రేషన్ కార్డులతో ప్రయోజనాలు

వీరఘట్టం: డిజిటల్ రేషన్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పాలకొండ సబ్ కలెక్టర్ సప్నిల్ పవార్ జగన్నాథ్ అన్నారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో రేషన్ లబ్ధిదారులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. రేషన్ డీలర్లు తమ వద్ద ఉన్న ఈ-పాస్ యంత్రాల్లో బయోమెట్రిక్ ద్వారా కార్డుదారుల వేలిముద్రలు సేకరించి కార్డులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఎం.బాల సరస్వతి, తహసీల్దార్ కామేశ్వరరావు, సీఎస్‌డీటీ జి.ప్రసాదరావు, ఆర్.ఐ రవితేజ, కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, బల్లా హరిబాబు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌కు విశేష స్పందన

వీరఘట్టం: సైన్స్ సెమినార్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన రావడం ఎంతో శుభ పరిణామం అని ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెమినార్‌లో ఇచ్చిన ×క్వాంటమ్ యొక్క కాలం... దాని శక్తి సామర్థ్యాలు¥ అనే అంశంపై విద్యార్థులు వివరించారు. మొత్తం 12 మంది విద్యార్థులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కత్తులకవిటి హైస్కూల్‌కు చెందిన జి.చైతన్య ప్రథమ స్థానం, పి.వి.ఆర్ పురం యూపీ స్కూల్‌కు చెందిన పి.షర్మిల ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి ఎంఈవోలు, సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.సాంబర, సి.హెచ్.రత్నాకరరావు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, జి.లక్ష్మణరావు, జి.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి



రైతుల సమస్యలు వివరిస్తున్న నాయకులు

పాలకొండ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్ష ప్రభావంతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తినాయుడు అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో కురుపాం, సాలూరు, పాలకొండ, నియోజకవర్గాలతో పాటు వీరఘట్టం, భామిని మండలాలకు చెందిన రైతులు సమస్యలు ప్రస్తావించారు. అధిక శాతం పత్తి, మొక్కజొన్న, అరటి తదితర వాణిజ్య పంటలతో పాటు కీలక దశలో వరి పంటకు ఏర్పడ్డ ఇబ్బందులతో రైతులు తీవ్రంగా ఆర్థిక నష్టం చవిచూశారన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో నాగావళి, వంశధార నదీ తీరాల వెంబడి పంట భూములు నీట మునిగి నష్టపోయిన కర్షకుల కష్టం గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన బుడితి అప్పలనాయుడు, గురబిల్లి అప్పలనాయుడు, పారినాయుడు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గిరిజనులు



మండలం వంశధార నదీ తీరం నుంచి ఇతర మండలాలకు ఇసుక అక్రమ రవాణా జోరందుకొంది. గురువారం బొడ్డగూడ వద్ద ఐదు ట్రాక్టర్లతో ఇసుక లోడ్లును స్థానిక గిరిజనులు నిలిపివేయడంతో అక్రమ రవాణా బయటపడింది. మండలానికి ఆవల గల కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. భామిని:

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ



సీతంపేట: కోటి సంతకాల సేకరణ చేపడుతున్న సర్పంచ్



భామినిలో కోటి సంతకాల కార్యక్రమం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ మండలంలోని పెదరామ పంచాయతీలో ఉద్యమంలా సాగుతోంది. ఈ సందర్భంగా సర్పంచ్ బి.తిరుపతిరావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదేశాల మేరకు సంతకాల సేకరణ విస్తృతంగా చేపడుతున్నామన్నారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే పన్నాగం పన్నిందన్నారు. ఇప్పుడు గిరిజన ప్రాంతాల్లో మెడికల్ చదువులంటే గిరిజన పిల్లలకు గగనమౌతాయన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

భామినిలో...

భామిని: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, రాష్ట్రంలో కూటమి అరాచక పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ జోరుగా సాగుతోంది.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోట సింహాచలం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఎంపీటీసీలు కొత్తకోట చంద్రశేఖర్, పాత్రుకొండ రాంబాబు, సర్పంచ్‌లు తొగరాన శ్రీను, మడపాన కేశవ, పార్టీ నాయకులు గెల్లంకి రమేష్, వలరౌతు వెంకటరమణ, కాగితాపల్లి కృష్ణారావు, అగతముడి రఘు, పోతల మజ్జి, కొర్ల రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురు మొక్కల పంపిణీ



రైతులకు వెదురు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, ఏపీఎం

భామిని: మండల కేంద్రంలో వెలుగు ఏపీఎం చక్రపాణి ఆధ్వర్యంలో ఎంపీడీవో ఎస్.వసంతకుమారి రైతులకు వెదురు మొక్కలను గురువారం పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు, రైతు అవసరాలకు అనువుగా మొక్కలు అందించినట్టు తెలిపారు. మండలంలోని 225 మంది రైతులకు 13,500 వెదురు మొక్కలను పంపిణీ చేసినట్టు ఏపీఎం చక్రపాణి తెలిపారు. వెలుగు సీసీలు ఉన్నారు.

గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి



ఎమ్మెల్యే జగదీశ్వరితో కలిసి గురుకుల పాఠశాలలోని బాత్‌రూమ్‌లు ప్రారంభిస్తున్న కలెక్టర్

కురుపాం: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. అదే పాఠశాలలో రూ.30 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన 40 బాత్‌రూమ్‌లను ఆయన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు అందించే లక్ష్యంతో కిచెన్ రూమ్ ఏర్పాటు చేసి దాని నుంచి వృథానీరు కాలువలోకి వెళ్లేలా పైపులైన్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఎంపీడీవో ఉమామహేశ్వరి, ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల్లేకుండా తరగతుల ప్రారంభమా?



గురుకుల పాఠశాలకు వచ్చిన అధికారులను ప్రశ్నిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు

కురుపాం: స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా తరగతులు ఎలా ప్రారంభిస్తారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సీతారాం అధికారులను ప్రశ్నించారు. గురువారం ఇదే పాఠశాలలో బాత్‌రూమ్‌ల ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను చూసి, వారిని నిలదీసే ప్రయత్నం చేశారు. ఇక్కడి విద్యార్థులు ఎంతో కాలంగా మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, 20 రోజుల క్రితం కురుపాం బాలికల గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందారని, అలాగే మరో 150 మంది విద్యార్థులు పచ్చకామెర్లు బారినపడి ఆస్పత్రిపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు హడావిడి చేసి బాత్‌రూమ్‌లు ప్రారంభించారన్నారు. విద్యార్థుల మరణాలు సంభవించినప్పుడు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, గురుకులాల కార్యదర్శి సహా ఇతర అధికారుల బృందాలు గురుకులాన్ని సందర్శించి కొత్త బోరు, సెప్టిక్ ట్యాంకు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు తూతూమంత్రంగా పనులు చేపడుతున్నారని విమర్శించారు. విద్యార్థుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడడం లేదని, వారికి ముందు ఏవి కావాలో వాటిని అందుబాటులోకి తీసుకురావాలని లేదంటే పెద్దఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

వైద్య సేవలపై కేంద్ర బృందం ఆరా..



వైద్య సేవలపై ఆరా తీస్తున్న కేంద్ర బృంద సభ్యులు వరుణ్ గైక్

పాలకొండ రూరల్: వైద్య రంగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ స్థాయిలో అమలు తీరుతెన్నులపై కేంద్ర బృందం గురువారం క్షేత్ర పర్యటన చేపట్టింది. ఈ క్రమంలో మండలంలోని వెలగవాడ, సింగన్నవలస గ్రామాల్లోని వెల్‌నెస్ కేంద్రాలను సందర్శించిన బృందం అక్కడి ప్రజలకు అందుతున్న సేవలపై సభ్యులు వరుణ్ గైక్, శాంతి తదితరులు ఆరా తీశారు. సిబ్బంది సదరు పథకాలపై ప్రజలకు కల్పిస్తున్న అవగాహనపై చర్చించారు. అనంతరం పాలకొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన బృంద సభ్యులు అక్కడి రక్త నిల్వల, టీబీ పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కడియం చిరంజీవి మాట్లాడుతూ రక్త నిల్వల కేంద్రానికి ప్రత్యేక అంబులెన్స్, టీబీ కేంద్రంలో విధులు నిర్వహించేందుకు టెక్నీషియన్ అవసరం ఉందన్నారు. జిల్లా మలేరియ నియంత్రణ అధికారి మణి, వైద్యులు రవి కుమార్, ఇతర సిబ్బంది జగదీష్ తదితరులున్నారు.

ఫ్యాన్ల వితరణ

పాలకొండ రూరల్: మండలంలోని భాసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంపీపీ బొమ్మాళి భాను సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందించారు. గురువారం పాఠశాలకు చేరుకున్న ఎంపీపీ అక్కడి విద్యార్థులకు అందుతున్న సేవలు, బోధనపై ఆరా తీశారు. వారి ఆరోగ్య భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని హెచ్ఎం జామి రమేష్‌కు, విద్యార్థుల శారీరక ధృడత్వానికి సహకరించే క్రీడలను ప్రోత్సహించాలని సంబంధిత ఉపాధ్యాయులు నెల్లి వెంకటరమణకు సూచించారు.

రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



9వ మహాసభల జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

పాలకొండ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఏపీ రైతు సంఘం నాయకులు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో గురువారం జరిగిన తొమ్మిదో జిల్లా మహాసభల్లో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ తోటపల్లి కాలువల ఆధునికీకరణ, వంశధార, జంఝావతి నదీ పరివాహక ప్రాంతంలోని రక్షణ గోడల నిర్మాణాలతో పాటు ఈ ప్రాంత సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. సోమనాథన్ కమిషన్ సిఫారసులు అమలుపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందన్నారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బంటు దాసు, కోశాధికారిగా గేదల సత్యనారాయణ, కార్యదర్శిగా కె.రవీంద్ర, ఉపాధ్యక్షులుగా బి.అప్పారావు, గౌరినాయుడుతో పాటు 25 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో జిల్లా నాయకుడు దావాల రమణరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీ

పాలకొండ రూరల్: స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా అర్హులకు స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ దాదాపుగా 22వేల పైచిలుకు కార్డులు పట్టణ, మండల పరిధిలో పంపిణీ చేశామన్నారు. వీటి ఆవశ్యకతను అధికారులు వివరించారు. కార్డులు వినియోగించి రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడ్డి మందు పిచికారీతో ఎండిపోయిన పంట



గడ్డి మందు కొట్టడంతో పాడైన పంట

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో సాలీల గంగులు అనే రైతు సాగు చేస్తున్న 6 సెంట్లు పొలంలో వీరఘట్టంకు చెందిన భోగి కామేశ్వరరావు అనే వ్యక్తి ఐదు రోజుల క్రితం గడ్డి మందు స్ప్రేయింగ్ చేయించి వరి పంటను నాశనం చేశాడని బాధిత రైతు ఆరోపించాడు. ఆర్థిక బలం ఉండడంతో సదరు వ్యక్తి దౌర్జన్యంగా తన పొలంలో గడ్డి మందు స్ప్రేయింగ్ చేయించి కోతకు వచ్చే వరి పంటను నాశనం చేసాడని, గతేడాది కూడా ఖరీఫ్ సమయంలో పంటను నాశనం చేసాడని ఆరోపించాడు. ఇంతటి దుర్మార్గానికి వడిగట్టిన కామేశ్వరరావుపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరాడు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



అంటుకట్టే విధానంపై శిక్షణ ఇస్తున్న కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు

కురుపాం: గిరిజన యువ రైతులకు ఇస్తున్న నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసరాజు కోరారు. మండలంలోని ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ, రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో జీడిమామిడి, పనస, సపోటా పంటల్లో అంటుకట్టే విధానం, ఆయా పంటలను పండించడం, వాటిల్లో అంతర పంటల సాగుపై నైపుణ్యం పెంపొందించేలా గురువారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని డి.కొత్తగూడ, ఎస్.కొత్తగూడ, వై.కొత్తగూడ, రామన్నగూడ, చిన్నఅంటిజోల గిరిజన గ్రామాలకు చెందిన 25 మంది రైతులకు ఈ శిక్షణ ఇచ్చారు.